క్లుప్తంగా

కాణిపాకం

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం ఓ దాత నగదు విరాళం అందజేశారు. తవణంపల్లి మండలం కొండరాజువ కాలువ గ్రామానికి చెందిన దాత దినకరనాయుడు ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, కోదండపాణి, విగ్నేష్ పాల్గొన్నారు.

నేడు జనాభా దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో బుధవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

23న వాసవీ మహిళా సంఘ వార్షికోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈనెల 23వ తేదీన వాసవీ మహిళా సంఘ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. చిత్తూరు నగరం బ్రాహ్మణ వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థాన సత్రంలో ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందులోభాగంగా అన్నకూటోత్సవం, శాకాంబరి పూజలు, గోత్ర దీపోత్సవం జరుగుతాయని తెలిపారు. సంఘసభ్యులు, మహిళలు పాల్గొన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న ఫిరోజ్అహ్మద్

బంగారుపాళెం: రక్తహీనతతో బాధపడుతున్న ఓ మహిళకు బుధవారం బంగారుపాళెం ముస్లిం జేఏసీ సభ్యులు రక్తదానం చేశారు. బంగారుపాళ్యానికి చెందిన ఓ బాధితురాలు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలికి అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉందని తెలుసుకున్న జేఏసీ అధ్యక్షుడు ఫిరోజ్అహ్మద్, సభ్యులు చిత్తూరులోని ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన జేఏసీ సభ్యులను అభినందించారు. జిలానీ, షంషీర్, రియాజ్, సమీర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

క్వారీల పరిశీలన


ఈచనేరి వద్ద క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్

తవణంపల్లె: మండలంలోని క్వారీలను బుధవారం తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండలంలో ఏడు క్వారీలు ఉండగా ప్రస్తుతం ఈచనేరి, గండుపల్లెలోని క్వారీలు మాత్రమే పనిచేస్తున్నాయని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. అదే విధంగా మండలంలోని క్వారీలను పరిశీలించి వాటి పనితీరుపై జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. సర్వేయర్లు బాబు, ఖాజావల్లీ, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

దశలవారిగా సమస్యల పరిష్కారం

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలను దశలవారిగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఆయన బుధవారం మేయర్ అముద, కమిషనర్ అరుణ, స్థానిక నాయకులతో కలిసి 48వ వార్డులో మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టారు. ఇందిరానగర్‌లో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వీధిలో ఉన్న మట్టిదిబ్బలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తంగవేలు కాలనీలో పెద్ద కాలువలు పరిశీలించారు. స్థానికుల వినతి మేరకు కాలువలో పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. అనంతరం రాజీవ్ నగర్, వన్నియర్ వీధిలో పర్యటించారు.

ప్రతి గురువారమూ డయల్ యువర్ ఎమ్మెల్యే

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఇక నుంచి ప్రతి గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే జగన్ మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 9849907885 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఎర్రచందనానికి ఉరిశిక్ష..!

చెట్లతోనే మానవ మనుగడ సాధ్యం. చెట్లను సంరక్షించడం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి.. అని అటవీశాఖ అధికారులు నిరంతరం చెబుతూనే ఉంటారు. చిత్తూరు నగరంలో మాత్రం అటవీశాఖ అధికారులు తీరు సర్వత్రా విమర్శలకు దారిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం ఇక్కడి రిజర్వు ఫారెస్టులో విస్తారంగా వెలసిన ఎర్రచందనం చెట్ల ఉనికికే ప్రమాదం వాటిల్లేలా తయారైంది.

– చిత్తూరు అర్బన్

- కందకం పేరిట గోతులు తవ్వి చోద్యం
- మట్టిని చెట్లపై వేస్తున్న వైనం
- చిత్తూరు రిజర్వు ఫారెస్టులో ఇష్టారాజ్యం


చిత్తూరు రిజర్వు ఫారెస్టులోని ఎర్రచందనం వృక్షాలు

చిత్తూరు నడిబొడ్డున పచ్చని చెట్లు, ఔషధ మొక్కలతో నిండిన రిజర్వు ఫారెస్టు (నగరవనం)లో ఎర్రచందనం చెట్లు విస్తారంగా ఉన్నాయి. దాదాపు 50 ఏళ్ల క్రితం నుంచే ఇక్కడ ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. వీటితో ఫారెస్టు లోపల జింకలు, దుప్పులు, అడవి కోళ్లతో పాటు ఎన్నో వన్యప్రాణులు జీవిస్తున్నాయి. అవి ప్రహరీదాటి జనావాసంలోకి వెళుతున్నాయి. వాటిపై కుక్కలు దాడిచేసి చంపేస్తున్నాయి. ఈ క్రమంలో జంతువులు బయటికి వెళ్లకుండా అధికారులు రిజర్వు ఫారెస్టు చుట్టూ ఉన్న ప్రహరీగోడకు ఆనుకుని కందకాలు తవ్వించారు. ఇందుకోసం సుమారు రూ.8 లక్షలకు పైగా నగదు వెచ్చించారు. మూడు కిలోమీటర్ల మేర తవ్విన కందకం నుంచి వెలువడిన మట్టిని పనులు చేసిన కాంట్రాక్టర్ బయటికి తరలించలేదు. దాన్ని ఎర్రచందనం చెట్లపై పోసేసారు. దాదాపు వంద అడుగులకు పైగా ఎత్తున్న వందలాది ఎర్రచందనం చెట్లు మట్టిలో కూరుకుపోయాయి. ఎక్కడికక్కడ గుంతతీస్తూ వెళ్లడం.. మట్టిని పక్కనే ఉన్న ఎర్రచందనం చెట్లపై వేయడం చేశారు. దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి. మట్టి కూరుకుపోవడంతో ఎర్రచందనం వృక్షాలు ఇక బతకడం అసాధ్యంగా కనిపిస్తోంది. గుంతలు తవ్వడానికి రూ.లక్షలు వెచ్చించిన అధికారులు, మట్టిని తీయడానికి మరోమారు రూ.లక్షలు ఖర్చు పెట్టడానికి ఇలాంటి పనులు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కందకాలు తవ్వే సమయంలోనే మట్టిని ఓ పక్కకు పడేయడమో, బయట తీసుకొచ్చి వేయడమో చేస్తే సరిపోయేది.

వాకర్స్‌కు అంతరాయం...

మరోవైపు కందకాలు తవ్వి పక్కనే మట్టిని వదిలేయడం, ఎర్రచందనం చెట్లపై పడేయడంతో ఫారెస్టు లోపలకు వాకింగ్‌కు వెళ్లే వారికి అంతరాయం ఏర్పడుతోంది. చిత్తూరు వాసులకు వరంగా ఉన్న రిజర్వు ఫారెస్టులో సుదీర్ఘకాలంగా వాకింగ్ ట్రాక్ అందుబాటులో ఉంది. ఫారెస్టు లోపల వాకింగ్ చేయడం కోసం నిర్వహణ పేరిట రుసుము వసూలు చేస్తున్న అటవీశాఖ అధికారులు, కందకాల వల్ల నడకదారిలో ఏర్పడిన అంతరాయం గురించి పట్టించుకోవడంలేదు. వాకర్స్ కోసం కనీసం తాగునీరు కూడా అందుబాటులో పెట్టడంలేదు. దాతలు కొందరు ముందుకు వచ్చి ప్రతిరోజూ నీటిని సమకూరుస్తున్నారు. ఇక ఓపెన్ జిమ్ వద్ద ఏర్పాటు చేసిన పరికరాలు తప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని బాగుచేయించాలని ఆలోచన లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.లక్షల్లో ప్రవేశ రుసుము వసూలు చేస్తున్న అటవీశాఖ అధికారులు, వాకర్స్‌కు కనీస సౌకర్యాలు కల్పించకపోగా, ఫారెస్టు నిర్వహణను గాలికి వదిలేసిందనే విమర్శలున్నాయి. దీనిపై ఫారెస్టు రేంజర్ థామస్ మాట్లాడుతూ 'కందకం తవ్వడంతో వచ్చిన మట్టితో కొత్త రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకే మట్టిని అక్కడే ఉంచాం. వీలైనంత త్వరలోనే మట్టిని తీసేసి, వాకర్స్‌కు అంతరాయం లేకుండా చూస్తాం.' అని పేర్కొన్నారు.



కందకాలు తవ్వి, ఎర్రచందనం చెట్లపై పోసిన మట్టి, కందకం చుట్టూ వదిలేసిన మట్టి

"

నెలకు పైగా ఇదే పరిస్థితి..



రిజర్వుడు అటవీ ప్రాంతంలో గుంతలు తవ్వి నెల రోజులకు పైనే అయ్యింది. వాకర్స్ వెళ్లే దారిలో మట్టిని పోసి వదిలేశారు. దీనివల్ల ఆ దారిలో వెళ్లలేని పరిస్థితి. ఇక ఎర్రచందనం చెట్లపై ఇష్టానుసారంగా మట్టిని పోసేశారు. ఇలాగే వదిలేస్తే చెట్లు చనిపోయే ప్రమాదం ఉంది. మట్టి ఎక్కడ అవసరమో అక్కడ వేస్తే బాగుంటుంది.

– రాజశేఖర్ నాయుడు, రిటైర్డ్ డ్వామా పీడీ

సౌకర్యాలు ఏవీ..?



నగర వనంలో నిర్వహణ పేరిట అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారు. మేం వద్దని చెప్పలేదు. కానీ వాకర్స్ కోసం కనీసం నీళ్లు కూడా పెట్టలేదు. ఓపెన్ జిమ్ వద్ద పరికరాలు తుప్పు పట్టిపోయాయి. కొన్ని విరిగిపోయినా పట్టించుకోవడంలేదు. ఇప్పుడు దారి మొత్తం మట్టి వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– నరసింహులు, వాకర్స్ సభ్యులు, చిత్తూరు

స్టాఫ్ నర్సుపై దాడికి నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది

బంగారుపాళెం: తిరుపతి రుయా ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సుపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం స్థానిక సీహెచ్‌సీ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి స్టాఫ్ నర్సుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంగారుపాళెం బ్రాంచ్ యూనియన్ అధ్యక్షురాలు సుమతిబాయ్ మాట్లాడుతూ రుయాలో స్టాఫ్‌నర్సు యశోద విధులు నిర్వహిస్తుండగా ఆమెపై దాడి జరిగిన విషయం తెలిసిందేనన్నారు. దాడిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఆస్పత్రి సిబ్బందిపై భవిష్యత్తులో దాడులు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, వైద్యులు స్వరూప్, శాలిని, విజయకుమారి, బ్రాంచ్ కార్యదర్శి నిజాముద్దీన్ పాల్గొన్నారు.

13న పుంగనూరులో చెస్ పోటీలు

పుంగనూరు : పట్టణంలోని లయన్స్ క్లబ్, గురుకులం చెస్ క్లబ్ సంయుక్తంగా ఈనెల 13వ తేదీన ఉదయం 9 గంటల నుంచి చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజర్ మణికంఠ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈస్ట్‌పేట మున్సిపల్ హైస్కూల్‌లో పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ టోర్నీ విజేతలను ఈనెల 18వ తేదీన నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 9581432310లో సంప్రదించాలని సూచించారు.

16న వాహనాల వేలం

పుంగనూరు : పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు వాహనాల వేలం చేపట్టనున్నట్లు ఇన్‌స్పెక్టర్ లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

దేశమ్మ ఆలయ గుత్తహక్కుల వేలం రేపు

నగరి : మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసిన నేత్రప్రదాయిని దేశమ్మ దేవాలయ ఆదాయ వనరుల గుత్త హక్కుల వేలం ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు గుత్తహక్కులు కేటాయించే నిమిత్తం వేలం ఉంటుందన్నారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కు, పార్కింగ్ హక్కులకు సీల్డు టెండరు ద్వారా, సజీవ కోళ్లకు, దుకాణ సముదాయాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులు బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తామన్నారు. దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చని వివరాలకు ఆలయం వద్ద గల ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టీచర్లకు ముగిసిన టీచ్ టూల్

నగరి : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నగరి, వెదురుకుప్పం, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు టీచ్ టూల్‌పై చేపట్టిన శిక్షణా బుధవారం ముగిసింది. కోర్సు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన మెరుగు పరచడానికి, విద్యార్థులకు అనుగుణంగా బోధించడానికి ఇప్పటివరకు అందించిన శిక్షణ దోహదపడుతుందన్నారు.

గెలిచినా.. ఓడినా.. ప్రజల పక్షమే


పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

నగరి/పుత్తూరు : గెలిచినా.. ఓడినా.. ప్రజల పక్షమే అని మాజీ మంత్రి ఆర్కేరోజా నిరూపిస్తున్నారు. బుధవారం నగరి–పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. గత ఐదేళ్లుగా ఈ పౌష్టికాహారం పంపిణీని మాజీ మంత్రి ఆర్కే రోజా గెలుపోటములకు అతీతంగా కొనసాగిస్తూనే ఉన్నారు. బుధవారం పలువురు గర్భిణులు, వారి వెంట వచ్చే చిన్నారులు పౌష్టికాహారం భుజించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం క్షేమం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు


తవణంపల్లె: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం తల్లీ బిడ్డకు క్షేమమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండ్రాజు కాలువలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రియాంక 43 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగుతో బేజారు


పారుతున్న మురుగు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం అనగల్లు పంచాయతీ బనవేడులోని మురుగుతో ప్రజలు బేజారవుతున్నారు. ఇళ్ల మధ్య మురుగు పారడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు వర్షాలు రావడంతో దోమల వ్యాప్తి మరింత పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఈ కారణంగా సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా స్పందించి మురుగును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత గుండె శిబిరానికి స్పందన


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ గ్లోరియా

పూతలపట్టు: ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని సుచి సంస్థ యాజమాన్య డైరెక్టర్ విజయకుమార్ గ్లోరీ అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 165 మంది గుండెకు సంబంధించిన ఈసీజీ, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహకారంతో మందులు అందజేశామన్నారు. వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జనాభా నియంత్రణ సమష్టి బాధ్యతని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణకు బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. పెళ్లీడు వచ్చాకే వివాహాలు చేసేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సురక్షిత కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. జిల్లాలో గురువారం నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం కావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి, అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు తయారు చేసి నివేదిక

- ఏపీడీ డాక్టర్ సుబ్రమణ్యం


దిగువ మోదలపల్లెలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ

తవణంపల్లె: రైతులు తమ పొలాల్లో పండ్ల తోటలు పెంపకానికి ప్రాధాన్యత ఇస్తూ అంచనాలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని చిత్తూరు క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని నలిశెట్టిపల్లె, కర్ణంవాండ్లవూరు, దిగువమోదలపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలతో సమావేశమయ్యారు. కూలీలు చెరువుల్లో పూడికతీత పనులు, కాలువల పనులు, ఖండిత కందకాల పనులు చేయాలని సూచించారు. రోజుకు కూలీలకు కనీస వేతనం రూ.275 నుంచి రూ.300 గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయించాలని క్షేత్రసహాయకులకు సూచించారు.చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు పెంచడానికి అంచనాలు తయారు చేసి పరిపాలన ఉత్తర్వులు కోసం నివేదిక పంపాలని వివరించారు. సోషల్ ఆడిట్ త్వరలో మండలానికి వస్తారని. రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఏపీఓ లలిత, ఈసీ వెంకటరమణారెడ్డి, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలోని వేలూరు రోడ్డు, గంగినేని చెరువు, గిరింపేట, దుర్గమ్మ గుడి, కలెక్టరేట్ కూడలి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం కమిషనర్ అరుణ తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గంగినేని చెరువు వద్ద పారిశుద్ధ్య వాహనాల లాగ్ పుస్తకాలను పరిశీలించారు. అవసరమైన అదనపు ట్రిప్పులు నడపాలన్నారు. గంగినేని పార్క్ లోపల, బయట పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలని కార్యదర్శులను ఆదేశించారు. ఉదయం ఏడు గంటలకల్లా ప్రధాన రహదారుల స్వీపింగ్ పూర్తి చేయాలని, అనంతరం వీధుల శుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ –2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా గ్యాంగ్ వర్క్‌ల నిర్వహణను పక్కాగా చేపట్టాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలని వినతి


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులను ఎత్తేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్‌వో పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడిన తమ నాయకుడిపై గతంలో కేసులు పెట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు బాలాజీరెడ్డి, కోశాధికారి దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలు పకడ్బందీగా చేయించాలి


మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రయోగాలను పకడ్బందీగా చేయించాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఒక రోజు ఓరియెంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత ల్యాబ్‌లలో సైన్స్ ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని తెలిపారు. ప్రయోగాల నిర్వహణపై చేపట్టాల్సిన నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో 30 పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

పనిచేయని సైకిళ్ల పంపిణీ

- మరమ్మతులు కూడా చేయించని వైనం
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం


విద్యార్థులకు సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె : గత ఐదేళ్ల క్రితం విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన సైకిళ్లను ఉపాధ్యాయులు గదిలో మూలనపడేశారు. టైర్లలో గాలి లేదు.. నట్లూ లేవు.. తుప్పు పట్టాయి. వాటికి కనీసం మరమ్మతులు కూడా చేయకుండా తవణంపల్లె హైస్కూల్లో బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పంపిణీ చేశారు. దీనిపై అక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు సైతం చెవులు కొరుక్కుని గుసగుసలాడారు. తవణంపల్లె హైస్కూల్‌కు దూర ప్రాంతాల నుంచి నడచి వచ్చే విద్యార్థులకు అందజేసేందుకు 2018–19 విద్యా సంవత్సరంలో సుమారు 200పైగా సైకిళ్లు వచ్చాయి. అప్పుడు పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థులకు వాటిని ఇవ్వలేదు. వాటిని ఒక గదిలో పడేశారు. ప్రస్తుత కొత్త ప్రభుత్వం, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావడంతో విద్యాశాఖ అధికారులు, తవణంపల్లె హైస్కూల్ ఉపాధ్యాయులు అత్యుత్సాహంగా తుప్పు పట్టి, కనీసం టైర్లలో గాలిలేక నడవలేని సైకిళ్లను పేద విద్యార్థులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇలాంటి సైకిళ్ల పంపిణీపై విద్యార్థుల తల్లి తండ్రులు మండిపడుతున్నారు.

మెస్ చార్జీలు చెల్లించాలని డిమాండ్


నినాదాలు చేస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

పుంగనూరు : విద్యార్థులకు మెస్ చార్జీలు, వసతిగృహాలకు బిల్లులు తక్షణం చెల్లించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శుభారాం డిగ్రీ కళాశాలలో రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న జిల్లా అధ్యక్షులు గంగరాజు, సిద్ధు, నియోజకవర్గ అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఉత్తన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పరిశ్రమలు, ప్రత్యేకహోదా, మెడికల్ కళాశాలలు నిర్మాణంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరారు. లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకేష్, కార్యదర్శిగా సంతోష్, మహిళా విభాగంలో గంగోత్రి, ముబారక్, ఉపాధ్యక్షులుగా సునీల్ కుమార్, అజయ్‌కుమార్, తేజకుమార్, తులసీరాం, సంజయ్‌కుమార్, శ్రీకాంత్, శిరీష, జయలక్ష్మి, హేమశ్రీ, అర్చన, పూజ ఎన్నికయ్యారు.